

# 11

# బహుమతి

"డియర్ పేరెంట్! వీలు చూసుకొని ఒకసారి స్కూలుకు రండి. విజయ్ చదువులో బాగా వెనుకబడిపోతున్నాడు. ఎవరితోనూ కలవడు. ఆ వయసు పిల్లల్లో ఉండాల్సిన ఉత్సాహం, చురుకుదనం వాడిలో కనపడవు. వాణ్ణి అర్థం చేసుకోడానికి, అవసరమైన సాయం చేయడానికి వాడి గురించిన అన్ని విషయాలు తెలియాలి. ఇంటి నుంచి ఏ జ్ఞాపకాల్ని, ఏ అనుభవాల్ని వెంట తెచ్చుకున్నాడో నాకు తెలిస్తేనే వాడికోసం ఏదైనా చెయ్యగలను."

చాలా యేళ్ళ క్రితం, విజయ్ స్కూలు టీచర్ పంపిన చీటీ అది. అప్పుడు వాడికి ఎనిమిదేళ్లు. అర్భకమైన దేహం, దేనిమీదా ఉత్సాహం చూపని కళ్లు వాడి స్కూలు జీవితం అల్లరి, కేరింత లేని మౌనగీతంలా ఉండేది. ఆరోజున ఆ టీచర్ని నేను కలవలేక పోయాను. ముఖం చెల్లలేదు. వాడి నుంచి ఏ జ్ఞాపకాన్నని తుడిచి వేసేది?

వాడు పుట్టినప్పుడు నాకింకా గుర్తే. ఉంగా, ఉంగా అని అరుస్తూ, అటు గెంతుతూ, ఇటు జారుతూ ఎక్కడ కింద పడతాడో నని భయం వేసేది. వీడు పిల్లాడా? దూకే జలపాతమా? అంటూ ఓ నర్సు తన

కవిత్వభాషలో మెచ్చుకోవటం నాకింకా గుర్తు ఉంది. అవాళ్టి ఆ ఉత్సాహమంతా వాడి నుంచి ఎవరు దోచుకున్నారు?

అప్పుడు నాకు ఇరవైయేళ్లు. వాడు నాకో అద్భుతం. గంటలు గంటలు అలాగే వాణ్ణి చూస్తూ ఉండేదాన్ని. వాణ్ణి చూస్తుంటే నాలో అతిశయంతో కూడిన జలదరింత. నా రొమ్ములు బరువుగా, గర్వంగా ఉప్పొంగుతాయి. మిలమిలలాడే ఎండ, వెండి జలతారులు కప్పే రాత్రులు, తోటల పొడవునా నవ్వులు చిందించే పుష్పాలు, ఇంకా ఏవేవో అందమైన దృశ్యాలు కళ్ళ ముందు బొమ్మ కట్టేవి. నాలో గొప్ప భావుకత వెల్లి విరిసేది.

చూస్తుండగానే ఆరునెలలు గడిచాయి. మెటర్నటీ లీవు, మరో మూడు నెలలు పొడిగింత అయిపోయాయి. ముసలి పనిమనిషికి వాణ్ణి వదిలివేసి ఆఫీసుకు వెళ్ళాల్సిన పరిస్థితి.

ఎన్నెన్నో జాగ్రత్తలు! పాల సీసా, కాచి చల్లార్చిన పాలు, దొడ్డికి కూర్చుని ఒళ్లంతా పులుముకోకుండా డైపర్లు, ఉచ్చ పోస్తే పదేపదే మార్చడానికి ఉతికిన పాతగుడ్డలు. ఉడకబెట్టిన గుడ్డు, కారెట్ ముక్కలు, అన్నీ ఇచ్చి నా మనసునక్కడే ఉయ్యాలకు తగిలించి, శరీరాన్ని ఆఫీసుకు నడిపించేదాన్ని. వాడు నాకు బంగారుకొండేగాని, ముసలి దాదీకి కాదుకదా! నేను ఆఫీసు నుండి వచ్చేసరికి ఉచ్చగుడ్డల్లో నానుతూ, గుక్కపెట్టి ఏడుస్తూ కనబడేవాడు. వాణ్ణి చూడగానే నాకూ ఏడుపు వచ్చేది. వాణ్ణి వదిలి వెళ్ళగూడ దనుకుంటాను. మళ్ళీ ఉదయాన్నే అంతా మామూలే. పాలసీసాలు, ఫారెక్స్, అవసరమైన జాగ్రత్తలు. అవతల సిటీబస్ వెళ్ళిపోతుందేమోననే ఆదుర్దా.

వాడికో తండ్రి ఉన్నాడుగానీ, ఆ మనిషి వారంలో కొద్దిక్షణాలే వాడికి కనపడే వాడు. హైదరాబాదులో అతని ఉద్యోగం. ఏ శుక్రవారం రాత్రో అలసిపోయి ఇంటికి వస్తాడు. శనివారం ఇంటి పనులనో, స్నేహితులనో తిరుగుతాడు. శనివారం రాత్రి ఆగంత కుడిలా వచ్చి పసివాడికీ, వాడి తల్లికీ మధ్య విలన్‌లా ప్రత్యక్షమవుతాడు. అప్పటికీ నోట్లో పాలపీకా, పక్కన మెత్తటి దిండూ అమర్చే వెళతాను. అతని స్పర్శలో కరిగి, శరీర మంతా అర్గాజమిక్ హాయి ప్రాకేవేళ, వాడు కెవ్వున కేక పెడతాడు. ఆ ఏడుపుకు అతన్నే మిటి? భగవంతుణ్ణి కూడా లెక్క చెయ్యాలనిపించదు. అతని క్రోధ నేత్రం రాత్రంతా ఎర్రగా వెలుగుతూనే ఉంటుంది. ఆదివారం అతనికి చికెన్ ఫ్రై, పలావులు కావాలి. పిల్లవాడికేమో నేను కావాలి. నేను ఎదురుగా కూర్చోవాలి. కబుర్లు చెప్పాలి. స్నానం చేయించాలి. ఆకలంటే రొమ్ము అందించాలి. అయిష్టాన్ని నటిస్తూ ముఖం తిప్పుకున్న వాడిని బ్రతిమిలాడుకోవాలి. చలువ బట్టల్లో ఉచ్చపోసుకొని చూస్తుంటే 'దొంగ భడవా' అంటూ చిరుకోపాల్ని చూపాలి. అవులింతలొచ్చినప్పుడు నా శరీరపు వెచ్చదనాన్ని కప్పి నిద్రపుచ్చాలి. అతనికిదంతా విసుగు.

'ఈపాటి భాగ్యానికి రెండొందలు ఛార్జీలు పెట్టుకొని హైదరాబాదు నుంచి రావాలా?' అంటూ నొసలు చిట్లిస్తాడు.

సంవత్సరం తిరక్కుండానే మళ్ళీ పిరియడ్స్ ఆగిపోయాయి. హఠాత్తుగా చెప్ప లేనంత నీరసం. బరువు బరువుగా తొమ్మిది నెలలపాటు వికృతమైన జీవిలా బ్రతకాలి. అంత పొట్ట వేసుకొని సిటీబస్సుల వెంట పరుగెత్తాలి. సెక్షన్ ఆఫీసురు విసుక్కోవటం, చౌకబారు కామెంట్లు చేయటం భరించాలి. ఆసుపత్రి, పురిటిగది, మందుల వాసన గుర్తుకొచ్చి రోతగా అనిపించేవి. అబార్షన్ చేయించుకుంటానని అతనితో చెప్పాను. గయ్యిమని లేచాడు. "పిచ్చి వేషాలెయ్యకు. ఈ అబార్షన్లు, అవీ మా ఇంటా వంటా లేవు. ఈ కాన్పు అయినాక కావాలంటే ఆపరేషన్ చేయిస్తాను," అని అరిచాడు.

నెలలు గడిచేకొద్దీ ఆఫీసుకెళ్ళడం దుర్భరమనిపించేది. ముఖ్యంగా సిటీబస్సులో ప్రయాణం. నాలుగో నెలలో ఒక నీరసపు ఉదయం. ఎప్పటిలాగే కంగారుగా బస్సు కోసం పరిగెత్తటం, కిక్కిరిసిన సిటీబస్సు. సీటుపై కూలబడదామంటే ఏ మగపురుగూ లేచి సీటు ఆఫర్ చెయ్యడు. నావైపు వింతగా, ఆబగా చూస్తుంటారుగానీ, 'నువ్వు కూర్చోమ్మా,' అని మనిషి ధర్మం చూపరు. డ్రైవరేమో ఆ డొక్కు బస్సుని మారుతీకారులా ఫీలయి డెబ్భై మైళ్ల స్పీడులో పోతాడు. ఒక భయానకమైన క్షణంలో సడన్ బ్రేకు తాలూకు జర్కులో బాలెన్స్ కోల్పోయి దొర్లిన పుచ్చకాయలా మెట్లపై నుండి జారి రోడ్డుపై పడ్డాను. మూడున్నర నెలల మాతృస్వప్నం చెదిరిపోయి రక్తపుటేరులైంది.

ఆసుపత్రిలో నిస్త్రాణంగా పడివున్న నావైపు అనుమానంగా చూశాడతను. టెలిగ్రాం ఇచ్చి హైదరాబాదు నుంచి పిలిపించాను. "మొత్తానికి నీ పంతమే నెగ్గించుకున్నావు," అన్నాడు నిరసనగా. ఉలిక్కిపడ్డాను. ఆ మనిషి ఆలోచనలు అర్థమయ్యేసరికి కడుపు దేవినట్లయింది. ఆరోజు నుంచీ అతను ముభావంగానే ఉండేవాడు. ఒకే చూరు కింద ఉంటూనే అపరిచితుల్లా బతకాల్సిన పరిస్థితి. నా ఆరోగ్యం అంతంత మాత్రంగానే ఉండేది. ఎప్పుడూ నీరసం. మనసులోనూ ఉత్సాహం ఉండేది కాదు. పిల్లవాణ్ణి పూర్తిగా ఆయాకే వదిలేయాల్సి వచ్చింది.

బాబుకు నాలుగో ఏడు వచ్చే సమయానికి నేను అనారోగ్యం పాలయ్యాను. టి.బి. శరీరాన్ని కుదిపివేసి శిథిలం చేసే జబ్బు. పిల్లవాడు దగ్గర ఉండడానికి వీల్లేదన్నారు. తప్పనిసరిగా వాణ్ణి వాళ్ల మేనత్త దగ్గర ఉంచాల్సి వచ్చింది. పిల్లవాణ్ణి ప్రేమతో కాక క్రమశిక్షణతో పెంచాలనే ఫిలాసఫీ వాళ్ళది. నెలరోజుల్లోనే కృశించి, రెండేళ్ళ పిల్లవాడిలా అయ్యాడు. రెండువారాలకొకసారి వాణ్ణి చూడడానికి వెళ్ళేదాన్ని. నా దగ్గరకు రావడానికి వెనుకాడేవాడు. చప్పుడు చెయ్యని ఏడుపు వాడి కళ్ళలో కనిపిస్తూ వుండేది.

ఆ సంవత్సరంలోనే వాడు బాగా మారిపోయాడు. శరత్ నవలలో హీరోగా గంభీరంగా ఉండేవాడు. ప్రేమకు, స్పర్శకు స్పందించలేనితనం వచ్చేసింది. పైగా అర్భకమైన వాడి దేహం, తనలోనికి తాను ముడుచుకుపోయి వింత జీవిలా అనిపించేవాడు.

అప్పట్లోనే మా సంసారిక జీవితంలో ఒక ప్రకంపనం, ఒక తుఫాను ఏర్పడ్డాయి. హైదరాబాదులో అతను ఇంకో స్త్రీతో జీవిస్తున్నట్లు తెలిసింది. "నిన్ను కట్టుకున్నాక జీవితానికి సుఖమే లేకపోయింది. ఎప్పుడూ ఉసూరుమంటుంటావు. పైగా ఈ టీ.బీ. ఒకటి. ఇప్పుడేమయిందిలే. కొన్ని రోజులు అక్కడా, కొన్ని రోజులు ఇక్కడా ఉంటాను," అన్నాడు. రాజీ పడలేకపోయాను. నిబద్ధత, విశ్వసనీయత వీగిపోయాక ఆ పెళ్ళిలో ఇంక అర్థం ఏముంది? ఒంటరిగా ఉండడానికి నిర్ణయించుకున్నాను.

పిల్లవాడికిది ఊహించని విషాదం. వాడిలో అభద్రతాభావం. ఏదో పోగొట్టుకొన్నవాడిలా వెలితి. మా ఇద్దరి మధ్య ఎక్కువ మాటలుండేవి కావు. నన్ను తప్పించుకు తిరగాలని ప్రయత్నించేవాడు. వాడి కళ్ళలో ఎన్నో ప్రశ్నలు. వాడికెలా వివరించాలి? వివాహాన్ని గురించి, స్త్రీ, పురుష సంబంధాల గురించి, స్త్రీల దు:ఖగాధల గురించి వాడికెలా చెప్పాలి?

అరోజు ఆ టీచర్ని నేను కలవలేకపోయాను. ముఖం చెల్లలేదు. కానీ నాలో ఏదో అపరాధభావన. వాడి అపరిణీతమైన వ్యక్తిత్వానికి నాదే బాధ్యత అనిపించేది. నా జీవితమంతా ఈ అపరాధ భావనతోనే మగ్గిపోయేదాన్ని. వాడికోసం ఏదైనా గొప్ప త్యాగం చెయ్యాలనిపించేది. వాడికి ఏ తల్లీ ఇవ్వలేని బహుమతి ఇవ్వాలనిపించేది.

నా భర్త నుండి విడిపోయాక నా చుట్టూ ఒక ప్రపంచాన్ని, సందడిని సృష్టించుకోవాల్సి వచ్చింది. మగడు లేనితనానికి ఒక ప్రత్యామ్నాయం అవసరం అనిపించింది. చదువుకోవటం ఉపయోగకరమైన కాలక్షేపం అనిపించింది. డిగ్రీ పూర్తి చెయ్యగలిగితే ఉద్యోగంలో ప్రమోషన్ కూడా వస్తుంది. కానీ ఈ చదవటమనేది అంత సులవైనదిగా కనిపించలా? బేసిక్స్ మీద పట్టులేక కీకారణ్యంలో ప్రయాణంలా ఉండేది. ముఖ్యంగా ఇంగ్లీషు. ట్యూషన్ అవసరమనిపించింది. హైస్కూల్లో ఇంగ్లీషు టీచర్‌గా ఉన్న జోసఫ్ గారు సాయంకాలాలు ఇంగ్లీషు ట్యూషన్ చెప్పడానికి ఒప్పుకొన్నారు.

జోసఫ్‌గారు తన మేధస్సు, పాండిత్యాన్ని దాచుకొని సాదాసీదాగా జీవిస్తున్న స్కూలు టీచరు. అతను క్రిస్టియన్ కావటంచేతనో, గిరీశం మార్కు మోసపు తెలివితేటలు లేకపోవటం చేతనో అతనికెందుకో రావలసినంత గుర్తింపు రాలేదు. ఇంగ్లీషులో ఆయన అద్భుతమైన కవిత్వం రాస్తారు. పదేళ్ల క్రితమే ఇలస్ట్రేటెడ్ వీక్లీలో అతని కవితలు అచ్చయినాయి.

ముప్పయేళ్లకు మళ్లీ విద్యార్థిని కావటం ఎంతో ఇబ్బందిని, సిగ్గుని కల్గించేవి. విజయ్‌కి ఇదో వింత. ప్రతి సాయంత్రం ఇంటికొచ్చేసరికి వాడికి ఎదురెళ్ళి, పుస్తకాల

సంచి అందుకొని తినడానికేమయినా పెట్టి, వాడు స్కూలు కబుర్లు చెపుతూ ఉంటే అశ్చర్యకరమైన నేత్రాలతో ఊఁ కొట్టటం వాడికిష్టం.

ఇప్పుడది సాధ్యం కావటంలేదు. ఎనిమిది వరకూ జోసఫ్‌గారితో ట్యూషన్. ఆపైన హడావుడిగా వంట. వంటయ్యేసరికి వాడు నిద్రపోతుంటాడు. రాత్రి ఏ తొమ్మిదింటికో వాడిని నిద్రలేపి, అన్నం నోట్లో కుక్కి పడుకోబెట్టాల్సి వచ్చేది.

విద్య అంటే వెలుగు అంటారు. ఆనందమంటారు. అది నిజమేమోననిపించేది. ఇంత ప్రపంచాన్ని అయ్యో, ఇన్నాళ్లు ఎలా పోగొట్టుకున్నాను అనిపించేది. జోసఫ్‌గారిది అంతులేని దాహం. ఎన్నెన్నో పుస్తకాలు ఇచ్చేవాడు చదవమని. మిల్టన్, వర్డ్స్‌వర్త్, ఎజ్రా పౌండ్, ఇలియట్, డిలాన్‌థామస్ ఒక్కొక్కళ్లని చదువుతుంటే ఆనందంతో కళ్ల వెంట నీళ్లు వచ్చేవి.

"అమ్మా... ఈ చొక్కాకు గుండీ లేదే. ఆ సాక్స్ మురికిపట్టి కంపుగొడ్తున్నాయి. ఎప్పుడూ ఆ బెండకాయ కూరేనా? రికార్డులో బొమ్మలు వేసి పెట్టమని వారంరోజులుగా అడుగుతున్నాను. పోయిన వారం కూడా సినిమాకు తీసికెళతానని మాటిచ్చి తరువాత కుదరదన్నావు. రేపు సాయంత్రం టెన్త్‌వాళ్లతో మాకు ఫైనల్స్ ఉన్నాయి. నీకెమో కుదరదు. ఆ ముసలి డొక్కు వెధవ ఒకడు నా ప్రాణానికి..."

ఛళ్‌మని వాడి చెంప పేలిపోయింది. వాడిని కొట్టిన మొట్టమొదటి సందర్భం అది. వాడు నివ్వెరపోయాడు. భయంతో వణికిపోయాడు. వాడిలో జరిగే సంచలనం నాకు తెలుసు. వాణ్ణి దగ్గరకు తీసుకొని, సారీ నాన్నా అని చెప్పాలనిపించింది. కానీ ఎందుకో విసుగు, కోపం. నా వంటరితనం, నా వెసులుబాటు, నా వ్యథ గురించి నా పిల్లవాడికి మాత్రం అవసరం లేదా? వాడి తల్లికీ ఓదార్పు కావాలని వాడికి అనిపించదా?

మా మధ్య గోడ పెరగటం గమనించాను. వాడు మామూలుగానే ఇంట్రోవర్ట్. ఇప్పుడు మరీ ముడుచుకుపోయాడు. ఒకరోజు రాత్రి ఎనిమిది దాటినా ఇంటికి రాలేదు. పది దాటాక నాకు కంగారు మొదలైంది. క్లాస్‌మేట్ల ఇంటికి వెళ్ళాను. అక్కడా లేడు. కంగారుగా ఊరంతా వెతికాను. చివరకు స్కూల్లోనే దొరికాడు. ఒకమూల అరుగుపైన పుస్తకాలు దిండుగా పెట్టుకొని, మోకాళ్లు పొట్టలోకి ముడుచుకొని చిన్నపాపలా పడుకొని ఉన్నాడు. నాకు చెప్పలేనంత దు:ఖం ఏడుపు వచ్చింది. "నాన్నా! ఏమిట్రా ఇది?" అన్నాను. వెక్కిళ్ళ మధ్య. ఉక్రోషంగా ముఖం పెట్టి,

"మీ ఇద్దరికి డిస్టర్బెన్స్ అని రాలేదు."

ఆ మాటకు కడుపులో పేగుల్ని పిసికినట్లనిపించింది. మౌనంగా ఇంటికి తీసుకొచ్చాను. ఆవాళ్టితో నా డిగ్రీ కలలు, జోసఫ్‌గారి సాహచర్యం ఆపివేశాను. ఎందుకు? అని ఇప్పుడు ప్రశ్న వేసుకుంటే నా దగ్గర సమాధానమే లేదు.

నా చుట్టూ కొంత సందడిని సృష్టించుకోవాల్సిన అవసరం మరోసారి కలిగింది. పుస్తకాలు నాకత్యంత ప్రియమైన నేస్తాలయ్యాయి. అందునా కవిత్వం, నా ప్రాణాధార మయింది. కమలాదాస్, డామ్‌మోరిస్, నిజామ్ ఇజల్, సీతాకాంత మహాపాత్ర, ఆంగ్లో ఇండియన్ కవులు, కవయిత్రులు నాకత్యంత ప్రియమైన వ్యక్తులయ్యారు. వాళ్ల కవిత్వం చదువుతుంటే చెప్పలేని హాయి, అర్థంకాని ముడులన్నీ వాటంతట అవే విడిపోతున్నట్లు గా అనిపించేది. నిత్యం చూస్తున్న ప్రపంచం, ఆ మనుషులే, ఆ సంఘటనలే సరికొత్త అర్థాలతో, సందేశాలతో ప్రత్యక్షమయ్యేవి. ఈ పుస్తక పఠనం వింతదాహం అయింది. నన్ను నిలవనీయని, నిత్యం వెంటాడే ఆ అద్భుత ఇంద్రజాలిక శక్తి ప్రభావంతోనే మొదటిసారిగా ఒక ఇంగ్లీషు కవిత రాశాను. 'జాస్మిన్' అనే కలం పేరుతో. దాన్ని అచ్చులో చూసుకొన్న క్షణాల్ని ఎలా వర్ణించను? అది భరింపశక్యం కాని ఆనందం.

ఈ మనసు పండుగ హడావుడిని విజయ్ గమనించాడుగానీ వాడికేం అర్థం కాలేదు. చుట్టుపక్కల ఇళ్లలో వాళ్లు, ఆఫీసులో కొలీగ్స్, వీళ్ళెవరికీ ఈ వింత స్పందనలు అర్థం కాలేదు. జోసఫ్‌గారి దగ్గరకు వెళ్ళాను. నేను వెళ్ళవలసిన సరైన ప్రదేశం అదే. ఆయన ఆనందంతో పసిపిల్లాడుగా మారాడు. ఆయన భార్య మేరీనీ, కూతురు ఎమిలీని పిలిచి ఆ కవిత చదివి వినిపించి, దాన్ని అంతరాల్లోని అందాల్ని వివరించాడు. ఆ ఊళ్ళోనే ఉన్న ఒక మాజీ ఎడిటరు దగ్గరకు తీసుకెళ్ళాడు. గొప్ప భవిష్యత్తు ఉన్న కవయిత్రిగా పరిచయం చేశాడు. ఆ ఎడిటర్ కవిత్వపు అంతరంగ సౌందర్యాన్ని గురించి చెప్పేడు. ఆఫ్రికన్, లాటిన్ అమెరికన్ కవితల్లోని సొంపును, భావాల గాఢతను వివరించేడు. ఒలెసొయెంకా, బెన్‌ఓక్రి, మొలైసాల పుస్తకాల్ని నాకు బహుమతిగా ఇచ్చాడు. నాలో కొత్త ఉత్సాహం, మనసు పూలతోట మళ్లీ చిగురిస్తున్నట్లు.

విజయ్‌కి టెన్త్ పరీక్షలు. పరీక్షలంటే వాడికెంతో భయం. ఇంగ్లీషు పరీక్ష రోజు నేను పరీక్షకి వెళ్ళనంటూ ఒకటే ఏడుపు. ఆఫీసుకు సెలవు పెట్టి వాడితోపాటు పరీక్ష హాలుకు వెళ్ళాను. వాడి భయం, దుఃఖం చూస్తే ఎందుకో దిగులు వేసింది. వీడి వయసు పిల్లలు తొలి యవ్వనపు పొగరుతో ఠీవిగా, అల్లరిగా తిరగటం నేనెరుగుదును. బ్రాడ్‌వే నాటకాలు, రాక్ మ్యూజిక్‌లు. 'శివ' సినిమాలు, సరికొత్త ప్రపంచం వాళ్ళది. విజయ్‌లో అలాంటి ఉత్సాహపు తీవ్రత ఎప్పుడూ చూళ్ళేదు నేను. యవ్వనపు వాకిళ్లలోకి వెళ్లకుండా బాల్యపు అంచులోనే వేళ్లాడుతున్నట్లుగా అనిపిస్తాడు. పరీక్షకు ముందు ధైర్యం కోసం నుదుట విభూతి బొట్టు పెట్టమని అడుగుతుంటే కళ్ళ వెంట నీళ్ళు తిరిగాయి. 'చిన్నా! నిన్నింత అర్భకుడిలా పెంచానేమిట్రా,' అని లోలోపల మథనపడ్డాను.

మిగిలిన పరీక్షలకు కూడా నాచేత సెలవు పెట్టించాడు. రిజల్ట్సు వచ్చి పేపరల్లో వాడి నంబరు చూసేదాకా భయం భయంగానే తిరిగాడు. ఇంటరులో బయోలాజికల్

సైన్సుగానీ, మాథమాటిక్స్ గానీ తీసుకోమంటే వణికిపోయాడు. బొమ్మలెయ్యటం రాదని, ఫిజిక్స్ అంటే భయమని గొడవ చేశాడు. హిస్టరీ, సివిక్స్‌లతో ఇంటర్ విద్యార్థి అయ్యాడు వాడు.

టెన్త్ ఫస్ట్‌క్లాసు తెచ్చుకున్నందుకు నాకేం బహుమతి ఇవ్వలేదే అని ఎప్పుడూ పోరుతుండేవాడు. ఒక కవితను వాడి పేరుతో ప్రచురణకు పంపాను. ప్రచురించాక వాడి చుట్టూ ప్రశంసలు, విస్మయాల కోలాహలం మూగి వాడు వింత ఆనందాన్ని అనుభవించటం నేను గమనించాను. వాడి పిరికితనానికి, మానసికమైన వెనులుబాటుతనానికి, ఇదో మందు అని ఎందుకు అనుకున్నానో నాకు తెలియదుగానీ, ఆ తరువాత నేను రాసిన కవితలన్నీ వాడి పేరుతోనే పత్రికలకు పంపటం మొదలుపెట్టాను. ఈ అయాచితమైన కీర్తిని వాడు ఒప్పుకోవటం, దాన్ని ఆనందించటం చాలా సహజంగా జరిగిపోయింది. ఇందులోని మంచి చెడ్డల్ని నేను ఎప్పుడూ చర్చించుకోలేదు. నేను తల్లినే కానీ మనస్తత్వ శాస్త్రవేత్తను కాను. వాడి కళ్ళలోని వెలుగులు, చిరునవ్వులకు మించి బహుమతి నాకేం ఉంటుంది?

i

ఈమధ్య కాలంలోనే జోసఫ్‌గారి కుటుంబంతో నా అనుబంధం విడదీయరానంతగా ఎదిగింది. ఏ కాస్త ఖాళీ ఉన్నా వాళ్ళ ఇంటికి వెళ్ళేదాన్ని. జోసఫ్‌గారితో గంటలు గంటలు కవిత్వాన్ని గురించి ముచ్చటించేదాన్ని. ఏ కొత్త పోయమ్ రాసినా ముందు ఆయనకు చూపించేదాన్ని. ఆయన కళ్లలోని మెచ్చుకోలు నాకెంతో ఇష్టం. మేరీ కూడా పనులు మానేసి మా మధ్య కూర్చునేది. నన్ను వాళ్ళ 'ఫామిలీ పొయెట్' అంటూ ముద్దు చేసేవాళ్లు. ఆదివారాలయితే రోజంతా వాళ్లింట్లోనే. లంచ్ అయినాక వాళ్ళిద్దరూ ఒక కునుకుతీస్తే, నేను వరండాలో కూర్చుని కాగితం, కలం ముందు వేసుకునేదాన్ని. సాయంకాలానికి ఒక పోయమ్ ప్రాణం పోసుకునేది. ఇక రాత్రంతా దాని గురించిన చర్చే.

విజయ్ యూనివర్శిటీకి వచ్చిన రోజుల్లో జోసఫ్‌గారి ఇంట్లో గొప్ప విషాదం జరిగింది. చిన్న జ్వరం. సరిగ్గా డయాగ్నొస్ చెయ్యకపోవటం వలస మహమ్మారిగా మారి, మేరీ ప్రాణాల్ని తీసింది. జోసఫ్‌గారికి ఊహించని విషాదం. "ముసలితనం మొదటిసారిగా మోయలేని బరువు అనిపిస్తోంది. పసిపాపడిలా నన్ను చూసుకునేది. ఇప్పుడిలా అనాథను చేసి వెళ్ళింది. నేనూ తనతో పోతే బాగుండు," అంటూ ఆయన కళ్ళనీళ్ళు పెట్టుకుంటే గుండె తరుక్కుపోయేది. కూతురు, అల్లుడు వెంట తీసుకెళ్తామని ఎంత పట్టుబట్టినా, ససేమిరా అంటూ మొండికేశారు.

ఇప్పుడా ఇంటికి వెళ్ళాలంటేనే భయం వేస్తోంది. స్టిల్ ఫొటోగ్రాఫ్‌లా ఒక నిర్జీవ ప్రపంచం ఎదురౌతుంది. పెరిగిన గడ్డం, మాసిన బట్టలు, ఖాళీచూపుల్తో జోసఫ్‌గారు, నిన్నటివో, మొన్నటివో కడగని అన్నం గిన్నెలు, నడుస్తుంటే పాదాల ముద్రలు పడే అంత దుమ్ము, మనుషులు నివసించే ఇల్లులా కాక, శవాన్ని దాచుకున్న పిరమిడ్‌లా ఉంది. ధైర్యం చేసి ఓ నిర్ణయానికొచ్చాను. ఆ ఇంటిని అద్దెకిచ్చి, జోసఫ్‌గారిని నాతో తెచ్చు కున్నాను. జ్వరం పట్ట దేవుడిలా మౌనంగా నా వెంట వచ్చాడు.

విజయ్ కళ్ళలో అసంతృప్తి. వింత వింత ప్రశ్నలు. అప్పుడెప్పుడో బాల్యంలో మా ఇద్దరి మధ్య కొన్నాళ్ళు నిలిచిన అడ్డుగోడలాంటి నిశ్శబ్దం మళ్ళీ ఏర్పడసాగింది. అప్పుడు పది పన్నెండేళ్ళ బాలుడు. అన్నీ సందేహాలు, అనుమానాలుగా సాగే వయసు. ఇప్పుడు ఇరవైయేళ్ల యువకుడు. మంచినీ, చెడునీ వేరుచేసి చూడగల పరిణితి రావాల్సిన వయసు. వాడు ప్రవర్తించాల్సిన తీరు ఇదేనా?

ఒక సాయంత్రం ఆఫీసు నుండి ఇంటికి వచ్చేసరికి జోసఫ్‌గారి వస్తువులన్నీ ఇంటి నుంచి అదృశ్యమైనాయి. బల్లమీద ఆయన రాసిన ఉత్తరం.

"మాలతీ! నా బంగారుతల్లీ! నిన్ను వదిలి వెళుతున్నానని బాధపడకు. ఉదయం విజయ్ నా పాదాల్ని చుట్టుకొని బావురుమని ఏడ్చాడు. ఈ ఇంట్లో నా స్థానాన్ని గురించి అందరూ వింతగా చెప్పుకుంటున్నారనీ, 'మీ అమ్మకు ఈ వయసులో ప్రియుడు కావాల్సి వచ్చాడా!' అంటున్నారని ఏడ్చాడు. నా గుండె పిండివేసినట్లయింది. నా తల్లీ! నిన్ను దేవుడు నాకిచ్చిన బిడ్డగానే చూసుకున్నాను. నీ దు:ఖాన్ని, ఆనందాన్ని తండ్రి హృదయం తోనే నేనూ అనుభవించాను. నావలన నీకెంత అపనింద! నేను వెళుతున్నాను. నా గురించి విచారపడకు. విజయ్‌ని కోప్పడకు. వాడి తప్పేమీ లేదు," -జోసఫ్.

విజయ్‌ని నేను కోప్పడలేదు. కాని వాడిపై కలిగే అసహ్యాన్ని మాత్రం

భావన ప్రముఖ ప్రచురణ సంస్థవాళ్లు వేసిన పుస్తకం. రాయల్టీ కూడా భారీగా ఇచ్చారు. ఆ ఆనందాన్ని ఉత్సవ వేడుకనీ (రాయల్టీని కూడా) విజయ్ సొంతం చేసు కున్నాడు. పుస్తకం విడుదలైన ఆరునెలల్లోనే సాహిత్య అకాడమీ పురస్కారం గురించిన ప్రకటన వచ్చింది. వింతగా దానికీ నాలో స్పందన రాలేదు. నా మెదడులో ఆనందాన్ని అనుభవించే స్పందనలేవో చచ్చిపోయినట్టుగా అనిపించసాగింది. పేపర్లలో విజయ్ ఫొటోలు ఇంటర్వ్యూలు, సాహిత్యరంగంలో ఊహించలేనంత పాపులారిటీ. ఇదివరలో చూపే సంకోచం, అపరాధభావం ఇప్పుడు తనలో కనబడటం లేదు. హక్కున్న సంపద లాగే ప్రవర్తిస్తున్నాడు.

ఒక ప్రముఖ పత్రికకు సంపాదకుడిగా ఉండమని ఆహ్వానం వచ్చింది. అప్పుడు మాత్రం నన్ను కలిశాడు. "ఇదో గొప్ప అవకాశం. నెలకు పన్నెండువేలు దాకా ఇస్తారు."

వాడు మాట్లాడిన మాటలివే. నీ మౌనంతో నాకు సంబంధం లేదు. ఒప్పుకోవటం మినహా నీకు వేరే గత్యంతరం లేదంటూ ఒక ఆజ్ఞను నా ముఖంపై విసిరినట్లుగా అనిపించింది.

పెళ్లి కూడా వాడే నిర్ణయించుకున్నాడు. ఐ.ఎ.యస్. అధికారి కూతురు. భారీగా కట్నం కూడా ఇస్తున్నారట.

"నువ్వొకచోట, నాన్నొకచోట నాది దౌర్భాగ్యపు బ్రతుకు. అందుకే వాళ్ళను పెళ్లి చూపులకు కూడా పిలవలేదు."

ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాను. పదహారేళ్ల తరువాత మళ్లీ ఈ నాన్న అనే మాటను విన్నాను.

"పెళ్లికి మీ ఇద్దరూ ఉండాలని వాళ్ల షరతు పెట్టారు. పెద్ద పెద్ద మంత్రులు, అధికార్లు వస్తున్న పెళ్లి అది."

నా ముఖంలోని అరుణిమను, తిరస్కారాన్ని చూసి కొంచెం వెనక్కు తగ్గాడు.

"నువ్వు కాదంటే ఇక్కడే తల పగలగొట్టుకు చస్తాను."

వాడి కళ్ల వెంట నీళ్లు! పిరికివెధవ, ఆడపిల్లలా ఏడుస్తున్నాడు.

"కాదనకమ్మా! ఇది నువ్వు నా పెళ్లికిచ్చే బహుమతి అనుకో."

నేనేం మాట్లాడలేదు. నా మౌనాన్ని అంగీకారంగా ప్రచారం చేసి, పెళ్లి హడావుడి మొదలుపెట్టాడు.

నాలో ఏదో తగలబడుతున్న భావన. మమకారం, ప్రేమ ఒట్టి నిర్జీవమైన వాంఛ లనే నైరాశ్యం. దీనంగా, జాలిగా నా ఆత్మ చుట్టూ అల్లుకుపోయిన వాడి పసితనం నా వైపు వెక్కిరింతగా చూస్తోంది. వాడి కోసం నేను ధారబోసిన రక్తమాంసాలు, మానసిక శక్తి ఆఖరికి నా కవిత్వం అన్నీ అనవసరపు త్యాగాలేమో అనిపించసాగాయి.

పెళ్లిపందిరి చాలా హడావుడిగా ఉంది. కవులు, కళాకారులు, అక్కడో కవిత్వపు మబ్బు. ఇక్కడో సాహిత్యపు మెరుపు. విజయ్ కళ్ళలోని గర్వాతిశయం. పెళ్లిపందిరంతటా కళకళలాడుతోంది. నా మాజీ భర్త కూడా హడావుడిగా అటూ, ఇటూ తిరుగుతున్నాడు.

"మా అమ్మా, నాన్న," అంటూ విజయ్ పేరు పేరునా అందరికీ పరిచయం చేస్తున్నాడు. నా మాజీ భర్త కళ్లలోని అతిశయపూర్వకమైన వెలుగు నన్ను దహించివేసింది. అతడి కిరాతకత్వానికి ఎదురునిలిచి పోరాడిన నేను, ఇప్పుడిలా 'అపజయం'లా అతని పక్కనే నిలబడటం అతనికి పైశాచిక ఆనందాన్నిచ్చింది కాబోలు.

"ఈ మధ్య ఏం రాస్తున్నారు? పెంగ్విన్ వాళ్లతో అగ్రిమెంటు కుదుర్చుకున్నా రటగా? దీంతో మీరు విక్రమ్‌సేథ్‌లాగా, సాల్మన్ రష్దీలాగా అంతర్జాతీయ ఖ్యాతిని కొట్టే యటం గ్యారంటీ?" విజయ్ చుట్టూ అభిమానుల కోలాహలం.

హఠాత్తుగా నా భుజంపై పాము పాకినట్లు తోచి ఉలిక్కిపడ్డాను. అతనే నా మాజీ భర్త. "పదహారేళ్లయినా నీ కోపం పోలేదా? పంతాలు, పట్టింపుల వయసు దాటాం. రాజీపడాల్సిన వయసు వచ్చేసింది," నాకతని మాటలు పాముబుసలాగే వినిపిస్తున్నాయి.

పెళ్లిపందిరి క్రమంగా పలచబడుతోంది. అతిథులంతా భోజనానికి వెళ్లారు. అగ్నిహోత్రం ముందు ఇద్దరు బ్రాహ్మణులు మాత్రం అర్థంకాని మంత్రాలేవో గొణుక్కుంటున్నారు. పట్టుబట్టలతో మిలమిలలాడుతున్నారు వధూవరులు.

"అమ్మా! ఇక్కడున్నావా?" అంటూ పెళ్ళికూతురుతో సహా నా దగ్గరకు వచ్చాడు విజయ్. "అమ్మా! నీకోసం ఈ డైమండ్ రింగ్ చేయించాను," అంటూ ఉంగరాన్ని బయటకు తీశాడు. నా మాజీ భర్తవైపు తిరిగి, "డాడీ! ఈ ఉంగరాన్ని అమ్మకు ఇవ్వు. మీరిద్దరూ మళ్లీ కలుసుకొన్న మధురస్మృతికి జ్ఞాపకంగా ఉండిపోతుందిది," అంటూ అతని చేతిలో ఉంగరాన్ని పెట్టాడు.

అతడు, నా మాజీ భర్త నా శరీరాన్ని తాకే దుస్సాహసాన్ని చేస్తున్నాడు. పురాణాల్లో చెప్పినట్లు ఇప్పటికిప్పుడు బూడిదైపోయే శక్తి నాకుంటే బాగుణ్ణు. పాము పాకుతున్నట్లుగా అతని చేతులు నా చేతిపై పారాడుతున్నాయి. నా వేళ్లకు ఉంగరాన్ని తొడుగుతున్నాయి.

అప్పుడు, పెళ్ళిపందిరి మధ్య, బ్రాహ్మణుల వేదమంత్రాల సందడి మధ్య భగభగలాడే నిప్పులగుండం, నాకు సేదతీర్చే అమ్మ ఒడిలా తోచి, అతను ఉంగరం తొడిగిన నా చేతిని తటాలున నిప్పుల మధ్య పెట్టాను. భయంతో, వెర్రికేకతో విజయ్ నన్ను వెనక్కు లాగబోయాడు. పెనుసత్తువతో అతన్ని ఎదుర్కొన్నాను. కాలిన శరీరపు కమురు వాసన పెళ్ళిపందిరంతటా వ్యాపించసాగింది. నా మాజీ భర్త భయంతో మళ్ళీ నన్ను తాకే సాహసం చెయ్యలేదు. ఉంగరం తొడిగిన నా చెయ్యి అలా తగలబడుతూనే వుంది.

*విపుల, అక్టోబర్ 1995*